నిరసన చేపడుతున్న యుటిఎఫ్ నాయకులు

ఇక ప్రయివేట్ కిక్కు..!

- మద్యం దుకాణాలకు టెండర్లు - 9 వరకూ దరఖాస్తులు, 11న లాటరీ
- వాటాలకు పోటీపడుతున్న ప్రజాప్రతినిధులు
- నూతన పాలసీపై మహిళా సంఘాల మండిపాటు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

మందుబాబులకు ఇకపై కొత్త కిక్కు ఎక్కనుంది. ప్రయివేటు మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 9 వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నారు. 11న లాటరీ ద్వారా దుకాణాలను కేటాయించనున్నారు. జిల్లాలో కొంత మంది ప్రజాప్రతినిధులు మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు వాటాల్లో పోటీపడుతున్నట్లు తెలుస్తోంది. నూతన మద్యం పాలసీపై మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి...

కొత్త మద్యం పాలసీ అమలుకు అడుగులు పడ్డాయి. మంగళవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. దుకాణాల కేటాయింపును జనాభా ప్రాతిపదికన నాలుగు విభాగాలుగా కేటాయించారు. పది వేలలోపు జనాభా, పది నుంచి 50 వేలలోపు, 50 వేల నుంచి ఐదు లక్షలలోపు, ఐదు లక్షల జనాభా ప్రాతిపదికన దుకాణాల కేటాయింపునకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కర్నూలు జిల్లాలో 99 మద్యం దుకాణాలకు, నంద్యాల జిల్లాలో 105 మద్యం దుకాణాల చొప్పున ఉమ్మడి కర్నూలు జిల్లాలో 204 మద్యం దుకాణాలను టెండర్లను ఆహ్వానించారు. వాటికి దరఖాస్తుల స్వీకరణ సాగుతోంది. గీత కార్మికులకు ఇస్తామని ప్రకటించిన పది శాతం దుకాణాలపై ఇంకా స్పష్టమైన ప్రకటన రావాల్సి ఉంది. ఈ నెల ఒకటి నుంచి తొమ్మిదో తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణ సాగనుంది. 11వ తేదీన లాటరీ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు జరగనుంది. దీనికోసం ఎక్సైజ్ శాఖాధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తొలిరోజు మంగళవారం దరఖాస్తులు రాలేదని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. రెండో తేదీ అమావాస్య కావడంతో, నాలుగోతేదీ తర్వాతే దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఒక వ్యక్తి ఎన్ని మద్యం దుకాణాలకైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ప్రతి దరఖాస్తుకూ రూ.రెండు లక్షలు నాన్ రిఫండబుల్ ఫండ్ కట్టాల్సి ఉంటుంది. లాటరీలో మద్యం దుకాణం దక్కినా, దక్కకపోయినా ఆ సొమ్ము వెనక్కి ఇవ్వరు. లాటరీలో దుకాణాలు దక్కించుకున్నవారికి రెండేళ్ల కాలపరిమితి ఉంటుంది. మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు నిర్దేశించిన లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అందుకు కొంత గడువు ఇస్తారు. మద్యం దుకాణాల్లో వాటా కోసం నాయకుల హుకుం మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కావడంతో కొంతమంది ప్రజాప్రతినిధులు వాటాల కోసం పావులు కదుపుతున్నారు. ఇతరులు దక్కించుకున్న మద్యం దుకాణాల్లోనూ వాటాల కోసం కొంతమంది ప్రజాప్రతినిధులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు చెబుతున్నారు. మద్యం దుకాణాలకు వేసే దరఖాస్తుల్లో సిండికేట్ విధానానికి తెరలేపేందుకు నాయకులు వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఏ దుకాణానికి ఎంతమంది దరఖాస్తు చేయాలి. దుకాణం దక్కించుకున్న వ్యక్తి దక్కని వ్యక్తులకు వాటా ఇవ్వాలా.. కొంతమొత్తంలో సొమ్ము చెల్లించాలా అనే దానిపై తీవ్ర తర్జనభర్జనలు పడుతున్నట్లు చెబుతున్నారు. దరఖాస్తుల సమర్పణలో సిండికేట్ విధానం సాగితే మాత్రం ప్రభుత్వ ఆదాయానికి గండిపడే పరిస్థితి ఏర్పడనుంది. మద్యం దుకాణాలకు సంబంధించి ముందుముందు మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే పరిస్థితి కన్పిస్తోంది. మరోవైపు ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీపై మహిళా సంఘాల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

మద్యాన్ని నియంత్రించాలి

మద్యం ధరలు తగ్గించడం కాదు..మద్యం షాపులను నియంత్రించాలి. ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మద్యం షాపులను నియంత్రిస్తాం అని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం ధరలు తగ్గించి తాగండి ఊగండి, చావండి అనే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. తక్కువ ధరలకు మద్యం తాగి విచక్షణ కోల్పోయి మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయి. భార్య భర్తలు కష్టపడి సంపాదిస్తే కుటుంబాలు గడవడం కష్టంగా ఉన్న ఈ తరుణంలో మహిళలు బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో నీరు సక్రమంగా అందకపోయినా మద్యం మాత్రం నిత్యము ఎప్పుడు కావాలంటే అప్పుడు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. దీంతో మద్యం తాగి చనిపోయిన వారి కుటుంబాలు అనాథలై వీధిన పడుతున్నాయి. బెల్ట్ షాపులు పూర్తిగా ఎత్తివేయాలి. మద్యం అంచలంచలుగా ఎత్తివేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలి.

- ఎన్.అలివేలు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి.

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

- కె.సురేష్ కుమార్ రాష్ట్ర సహాధ్యక్షుడు
- యుటిఎఫ్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం యుటిఎఫ్ నగర కమిటీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా సత్యాగ్రహ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గాంధీజీకి యుటిఎఫ్ నాయకులు వినతిపత్రాల అందజేసి నిరసన తెలిపారు. సీనియర్ నాయకులు సర్వేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ , జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్‌పాటి మాట్లాడారు. మున్సిపల్ పాఠశాలలను ప్రభుత్వ విద్యాశాఖలో విలీనం చేసినప్పటికీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమించుకున్నందుకు ఎస్‌జిటి పండిట్ , పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. నవంబర్‌లోగా అప్‌గ్రేడ్ అయిన మున్సిపల్ టీచర్లకు వెంటనే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పాఠశాలల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులకు అర్హులైన వారికి అర్బన్ ఎంఇఒలుగా నియమించాలన్నారు. వారికి కూడా జిపిఎఫ్ ఖాతాలను తెరిపించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి దశలవారీగా పోరాటం చేపడుతున్నామన్నారు. ఈనెల 16న కార్యాలయం ముట్టడి తోపాటు 22న డైరెక్టర్ కార్యాలయం ముందు 24 గంటల ధర్నా చేపడుతున్నట్లు వారు వెల్లడించారు. ఈ పోరాటాలకు మున్సిపల్ ఉపాధ్యాయులు సంఘీభావం తెలిపారని కోరారు. జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, ఆర్థిక కార్యదర్శి, యెహోషువ, జిల్లా కార్యదర్శి ఇబ్రహీం, రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు, జిల్లా నాయకులు మారెప్ప, ప్రసాద్, సురేష్, సోమన్న, జెవివి జిల్లా అధ్యక్షులు బిడి. సుధీర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెట్ పరీక్ష ప్రారంభం

- 6 పరీక్షా కేంద్రాల్లో 40660 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ జిల్లాలో గురువారం నుండి ప్రారంభం కానుంది. జిల్లాలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో దాదాపుగా 40660 మంది అభ్యర్థులు పరీక్షను రాయనున్నారు. ఉదయం 9:30 నుండి 12 గంటల వరకు తర్వాత మధ్యాహ్నం రెండున్నర గంటల నుండి 5 గంటల వరకు రెండు విడతలుగా పరీక్ష నిర్వహిస్తున్నారు. కర్నూలు నగరంలో 4, ఆదోని ఎమ్మిగనూరు కేంద్రాల్లో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు పరీక్ష నిర్వహణ ఏర్పాట్లను బుధవారం నాడు రాష్ట్ర పరిశీలకులు నరసింహారావు తో పాటు విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సౌమ్యల్ పాల్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్షా నిర్వహణకు అకౌంటుగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు వెల్లడించారు. జిల్లాలో ప్రశాంతవాతావరణంలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లావిద్యాశాఖ అధికారి కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌లైన్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు ఏమైనా సమస్యలు ఉంటే ఈ హెల్ప్‌లైన్ కేంద్రం నంబర్లు 8121821266, 6300046199,9177689177 సంప్రదించాలని పేర్కొన్నారు.

గాంధీ స్ఫూర్తితో స్వచ్ఛతాహి సేవ అమలు

- మంత్రి టిజి.భరత్
- ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నివాళులర్పిస్తున్న మంత్రి భరత్, ఎంపీ నాగరాజు, కలెక్టర్ రంజిత్ బాష, ఎమ్మెల్యే గౌరు, తదితరులు

గాంధీజీ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛతహి సేవా కార్యక్రమం అమలు చేస్తుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రివర్యులు టిజి.భరత్ అన్నారు. బుధవారం మహాత్మాగాంధీ 155వ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ వద్ద రాంభూపాల్ చౌదరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహానికి రాష్ట్ర పరిశ్రమలు శాఖ మంత్రి టిజి.భరత్, కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తదితరులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మంత్రి టిజి.భరత్ మాట్లాడుతూ అహింసనే ఆయుధంగా తీసుకొని స్వరాజ్యం సాధించిన గాంధీజీని మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడుస్తూ వారి ఆశయాలను సాధించాలనిపేర్కొన్నారు. మాంటిస్సోరి పాఠశాల కరస్పాండెంట్ కెఎం.రాజశేఖర్ ఆధ్వర్యంలో మాంటిస్సోరి విద్యార్థులు మహాత్మా గాంధీజీ వేషధారణలో పాల్గొన్నారు. నగర మేయర్ బివై.రామయ్య, ఇంఛార్జి డిఆర్‌ఓ చిరంజీవి, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, సిపిఒ హిమ ప్రభాకర్ రాజు, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, 17వ వార్డు కార్పొరేటర్ పద్మాలత, కెవి.సుబ్బారెడ్డి విద్యాసంస్థలు అధినేత కెవి.సుబ్బారెడ్డి, రాంభూపాల్ చౌదరి, ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు వై.రామేశ్వర్ రెడ్డి, వి.సుమంత్ చౌదరి, మల్లికార్జున, సెక్రెటరీ పి.ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ స్ఫూర్తితో పునరంకితం

- గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను స్ఫూర్తిగా చేసుకుని విధుల్లో పునరంకితమవుదామని కర్నూలు జిల్లా ఎస్‌పి జి.బిందుమాధవ్ పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎఆర్ పోలీసు విభాగం దగ్గర మహాత్మ గాంధీ, భారతీ మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీల జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. జాతిపిత మహత్మగాంధీ, ప్రధానిలాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి జిల్లా ఎస్‌పి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సమరంలో గాంధీ అనుసరించిన అహింసావాదం, ఆలోచనలు, సిద్ధాంతాలను స్మరించుకున్నారు. గ్రామాల అభివృద్ధి, సమైక్యతా భావాన్ని గుర్తు చేసుకున్నారు. ఎస్‌పి మాట్లాడుతూ అహింసనే ఆయుధంగా చేసుకుని బ్రిటిష్ వారిని ఎదిరించి, శాంతియుతంగా పోరాడి దేశానికి స్వాతంత్రాన్ని అందించి చరిత్రలోనే గొప్ప వ్యక్తిగా, జాతిపితగా మహాత్మగాంధీ నిలిచారన్నారు. మహనీయుని ఆలోచనలు, సంస్కరణలు మన అందరికీ ఆదర్శప్రాయమన్నారు. మహత్మగాంధీ అడుగుజాడల్లో అందరూ ముందుకు సాగాలని జిల్లా ఎస్‌పి ఆకాంక్షించారు. ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసరావు, సిఐలుప్రసాద్, గుణశేఖర్ బాబు, శేషయ్య, ఆర్‌ఐలు నారాయణ, సోమశేఖర్ నాయక్, జావేద్ , ఎస్‌ఐలు, ఆర్ ఎస్‌ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు కార్పొరేషన్ : బ్రిటిష్ బానిసత్వం నుంచి స్వాతంత్ర్యం సాధించడంలో ముఖ్య భూమిక పోషించిన జాతిపిత మహాత్మాగాంధీ జననం జగతికే ఆదర్శమని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. బుధవారం స్వాతంత్ర్య సమరయోధులు మహాత్మాగాంధీ, దేశ మాజీ ప్రధాని, భారతరత్న అవార్డు గ్రహీత లాల్ బహదూర్ శాస్త్రి జయంతులను పురస్కరించుకుని, నగరపాలక కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ఆర్‌ఓ జునైద్, కార్యదర్శి నాగరాజు, సూపరింటెండెంట్లు సుబ్బన్న, రమేష్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, వాజిద్ సిబ్బంది వీరకుమార్, సాదిక్, రాజు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

ముఖ్యమంత్రి పర్యటనతో ఒరిగిందేమీ లేదు

మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ప్రజాశక్తి- పత్తికొండ

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పర్యటన వల్ల పత్తికొండ ప్రజలకు ఒరిగిందేమీ లేదని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. బుధవారం పత్తికొండ మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో కంగాటి శ్రీదేవి మాట్లాడారు. ముఖ్యమంత్రి పత్తికొండకు వస్తే తమ ప్రాంత అభివృద్ధిపై మాట్లాడతారని గంపెడు ఆశతో ఉన్న ప్రజలకు తీవ్ర నిరాశ ఎదురైందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ కుమార్ నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పూర్తిగా విఫలమయ్యారని, హంద్రీనీవా ద్వారా నియోజకవర్గంలోని చెరువులను నింపేందుకు ఎలాంటి ప్రణాళిక హామీ ఇవ్వలేదని అన్నారు. ముఖ్యమంత్రి కేవలం ఒక గ్రామానికి పర్యటనను పరిమితం చేయడంలో ఆంతర్యం ఏమిటిని ప్రశ్నించారు. వంద రోజులు పాలనలో ప్రజలకు చేసింది ఏమి చెప్పుకోలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికొండ ప్రజలకు ఎల్లవేళలా వైసిపి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

రైతులకు పప్పు శనగ సబ్సిడీ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-మద్దికేర : ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు పప్పు శనగ సబ్సిడీ విత్తనాల పంపిణీ ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు. మద్దికేర వ్యవసాయ ఆఫీస్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలానికి 3890, క్వింటాల పప్పు శనగ జెహెచ్-11 రకం కేటాయించారన్నారు. ఒక క్యింటానికి గరిష్టంగా 100 కిలోలు పప్పుశనగలు, చొప్పున ఐదు బస్తాలు ఇస్తామన్నారు. ఒక క్యింటం పప్పు శనగ ధర 9400 నిర్ణయించగా, అందులో సబ్సిడీ 25శాతం రూ.2,350 పోను, దానికి క్వింటానికి 7050 చెల్లించవలసి ఉంటుందన్నారు.

ఉల్లి వ్యాపారుల సవేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కార్యదర్శి జయలక్ష్మి

ఉల్లి రైతులకు గిట్టుబాటు అందేలా చూడాలి

ఉల్లి వ్యాపారులతో సవేశం నిర్వహించిన మార్కెట్ కార్యదర్శి జయలక్ష్మి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు అధిక సంఖ్యలో ఉల్లి దిగుబడులు వస్తున్నందున ఎక్కడ కూడా రైతులకు నష్టం లేకుండా గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని లైసెన్సు కలిగిన ప్రతి వ్యాపారి బిడ్డింగ్‌లో పాల్గొనాలని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి ఆర్.జయలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో ఉల్లి దిగుబడులు అత్యధికంగా ఉన్నాయని వ్యాపారులు అందరూ కూడా సరైన ధరను ఇవ్వాలని తెలిపారు. ఇదే అదునుగా రైతులను మోసం చేసేలా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సహాయ కార్యదర్సులు రెహమాన్, వెంకటేశ్వర్లు వ్యాపారులు పాల్గొన్నారు.

పాట ఉన్నంత కాలం వాసు జీవించి ఉంటారు

వర్ధంతి సభలో వక్తలు, ప్రజాసంఘా నాయకులు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

పాట ఉన్నంతకాలం వాసు జీవించి ఉంటాడని, ఆయన జీవితం చిరస్మరణీయమని వక్తలు, నాయకులు అన్నారు. ప్రజాకళాకారుడు, రచయిత, గాయకుడు పిఎన్ఎం రాష్ట్ర నాయకులు ఆర్ఎ.వాసు 8వ వర్ధంతి సందర్భంగా ఐద్వా, డివైఎఫ్ఐ, పిఎన్ఎం. కెవిపిఎస్, ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించారు. అమీలియా హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వర్ధంతి సభకు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె. అరుణ అధ్యక్షత వహించారు. ముందుగా ఆర్ఎ.వాసు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు వాసు రాసిన పాటలను ఆలపించారు. అనంతరం జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి. నిర్మల, పిఎస్. రాధాకృష్ణ, న్యూ సిటీ కార్యదర్శి టి .రాముడు. పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ఇ, పుల్లారెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు, పిఎన్ఎం జిల్లా కార్యదర్శి రాజులు మాట్లాడుతూ ప్రజా కళాకారుడు కవి రచయిత ఆర్ ఎ. వాసు పేదలను నివసించే ప్రాంతమైన ఇందిరా గాంధీ నగర్‌లో పుట్టి ప్రజలు, కష్టజీవులు పడుతున్న బాధలను చూసి ప్రభుత్వాలను ప్రశ్నించే గొంతుకగా మారి 250 పాటలకు పైగా రాసి అన్ని వర్గాల ప్రజలలో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. పాట ఉన్నంత కాలం వాసు జీవించి ఉంటాడని, ఆయన జీవితం చిరస్మరణీయమని అన్నారు. పిఎన్ఎం. జిల్లా నాయకురాలు ఆర్ఎ. సుజాత, ఎం లోకేష్ , బతుకన్న, బాలయ్య, సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం. రాజశేఖర్ , రజక సంఘం జిల్లా కార్యదర్శి గురు శేఖర్, శేషాద్రి,సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు, ఆర్ నరసింహులు, సిహెచ్ సాయి బాబా, కే సుధాకరప్ప, అమీలియా హాస్పిటల్ డాక్టర్లు ప్రసన్న,రమాదేవి, ఆప్టికల్ మేనేజర్ చంద్రహాస్, క్యాంపు మేనేజర్లు వరప్రసాద్, ప్రాణేష్,అమీలియా హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ శిబిరంలో సుమారు 200 మంది వైద్య సేవలను పొందారు.

వాసు చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పిస్తున్న ప్రజాసంఘా నాయకులు

ఈ.తాండ్రపాడులో వాసుకు ఘన నివాళి

కర్నూలు క్రైమ్ : ప్రజల సమస్యలను పాటల రూపంలో మలిచిన ప్రజాకవి ఆర్ఎ వాసు అని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ అన్నారు. మంగళవారం కర్నూలు మండలం ఈ తాండ్రపాడు గ్రామంలో ఆర్ఎ వాసు ఎనిమిదవ వర్ధంతి సందర్భంగా ప్రజానాట్యమండలి, డివైఎఫ్ఐ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ ప్రాంగణంలో వర్ధంతి సభను నిర్వహించారు. వాసు చిత్రపటానికి పూలమాలవేసి నాయకులు నివాళులర్పించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెవి.నారాయణ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఇ.నాగరాజు, సర్పంచి బాలపీరా, మండల నాయకులు హుస్సేన్ మాట్లాడారు. ఆర్ఎ వాసు జిల్లాలో ప్రజాకవిగా సుపరిచితుడని అన్నారు. పేదల పక్షాన నిలబడి వారి సమస్యలను పాటల రూపంలో ప్రజల ముందు ఉంచిన గొప్ప కవి అన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు నిర్వ హించిన సాంస్కృతిక ఆటపాట మాట కార్యక్రమంలో భాగంగా వాసు రచించిన వివిధ పాటలను ఆలపించారు. పోతులూరి వీరబ్రహ్మం, చెమట చుక్క, వేమన కళారూపకాలను ప్రదర్శించారు. ఈ.తాండ్రపాడు ఎంపిటిసిలు మెహబూబ్‌బాష, వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు అంజినేయులు, వెంకట స్వామి, ఆర్ఎ.వాసు సతీమణి ఆర్ఎ. సుజాత, ప్రజానాట్యమండలి నాయకులు పి.నోమేశ్వరి, లోకేష్, ఏలియా, బాలన్న, సురేష్, మధు, సరిత, లక్ష్మి, హసీనా, నాయకులు మునిస్వామి, పిఎండి హుస్సేన్, ఆజాద్, శాంతన్న పాల్గొన్నారు.

ఈ.తాండ్రపాడులో వాసుకు నివాళి అర్పిస్తున్న నాయకులు

సుందరయ్య భవన్‌లో మెడికల్ క్యాంపు

శనగ విత్తనాలు 50 శాతం సబ్సిడీతో ఇవ్వాలి

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రైతులకు శనగ విత్తనాలను 50శాతం సబ్సితో ఇవ్వాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ కోరారు. కర్నూలు జిల్లాలో రబి సీజన్‌లో విస్తారంగా శనగపంట సాగు చేస్తారని, గతరెండు సంవత్సరాలుగా శనగ పంట వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. 2022-23 అకాల వర్షాల వల్ల పంట చేతికి రాలేదన్నారు. గత సంవత్సరం వర్షాలు లేక పంట దిగుబడి రాలేదు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టం పోయారన్నారు. ఈ సంవత్సరం నల్లరేగడి భూముల్లో శనగ పంట వేయడానికి రైతులు సిద్ధపడుతున్నారన్నారు. ప్రభుత్వ ఇచ్చే సబ్సిడీ నామమాత్రంగా ఉన్నదని, ప్రభుత్వం తక్షణమే 25 శాతం నుండి 50 శాతం సబ్సిడీ పెంచి ఇవ్వాలని జి.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బయటి మార్కెట్ కన్నా విత్తన వ్యాపారులు ఇచ్చే ధర ప్రభుత్వం ఎక్కువగా చూపిస్తున్నదని, రూ.7,500 క్వింటాలు ఉండగా రూ.9500 ఉన్నట్లు చూపించడం ఎంతవరకు సమంజసం ప్రశ్నించారు. కర్నూలు జిల్లాలో ఆస్పరి ఆలూరు పత్తికొండ దేవనకొండ తుగ్గలి మండలాలే కాకుండా పశ్చిమ ప్రాంతంలో అన్ని మండలాల్లో విస్తారంగా శనగ పంటను సాగు చేస్తారని తెలిపారు. రెండు సంవత్సరాలుగా తీవ్రంగా శనగపంట రైతులు నష్టపోయారు. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పునరాలోచన చేసి నాణ్యమైన విత్తనాలు రైతులకు సరఫరా చేసి 25 శాతం నుండి 50శాతం వరకు పెంచి రైతులకు సరఫరా చేసి న్యాయం చేయాలని రామకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

దారిపక్కన పైప్‌లైన్ గుంతలు

పైపులైను గుంతలను పూర్చండి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేతవరం నుండి గార్గేయపురం వెళ్లే ప్రధాన రహదారి వెంట ఓర్వకల్ పరిశ్రమల నీటి అవసరాల కోసం తవ్విన పైపులైన్ గుంతలను త్వరగా పూడ్చాలని సిపిఎం మండల కార్యదర్శి బి నాగన్న డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న, గ్రామ నాయకులు జి. శ్రీధర్, బి.వెంకటేశ్వర్లు, రంగస్వామి, బుగ్గరాముడు కలసి ఆ రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలల క్రితం ఓర్వకల్ మండలంలోని జయ, రాజ్ ఇస్పాత్ వంటి పరిశ్రమల నీటి కోసమని పైపులైను కోసమని కేతవరం గార్గేపురం ప్రధాన రహదారి వెంట భారీ గుంతలను తవ్వరని వాటిని పూడ్చకుండా కాంట్రాక్టర్ వదిలే సారన్నారు. వర్షాలకు ఈ భారీ గుంతలు నీటితో నిండిపోయి కేతవరం గ్రామానికి చెందిన జి.రంగ స్వామి రైతు సుమారు రూ.80 వేల చేసే ఆవు ఆ గుంతలో పడి మృతి చెందిందన్నారు. ఈ రహదారిలో అనేక వాహనాలు తిరుగుతుంటాయని వందలాదిమంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటారన్నారు. ఇది ఇలా ఉంటే అనేక ప్రమాదాలు అవకాశం ఉంటుందని తక్షణమే ఈ గుంతలను పూడ్చాలని వారు డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. మద్దిలేటి, మధు సూదన్ బాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE
XI ADDI CHIEF JUDGE
CITY CIVIL COURT
AT :: HYDERABAD.
O.P.NO. 438 OF 2022

BETWEEN:
M.Srinivasulu @ Srinivas
...Petitioner
AND
Myla Penchalaiah and Others.
...Defendent

To,
1.Boya Ram Gopal Naidu,S/o. Narasimhulu,Occ:Driver,R/o. Stantha puram,Balaji nagar Colony, Kurnool City, Kurnool Dist.
...R3

Please take Notice that the above named Plaintiff filed above O.P. against you for grant of compensation , The Hon'ble Court posted the above case on **24-10-2024**.at **10.30** am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)
E.MADAN MOHAN,
Advocate
H.No.9-5-302/1,
Champapet,Hyderabad.

పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న అధికారులు

ముగిసిన స్వచ్ఛతా హి సేవా

- పారిశుధ్య కార్మికులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మేజర్ పంచాయతీ చెత్త సంపద తయారీ కేంద్రం వద్ద స్వచ్ఛతాహి సేవా ముగింపు సభ నిర్వహించారు. బుధవారం మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా అన్ని పంచాయతీల్లోనూ వివిధ రకాల కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల గ్రామం పరిశుభ్రంగా మారి స్వచ్ఛ గ్రామాలుగా రూపొందుతాయని చెప్పారు. మండలాన్ని స్వచ్ఛ మండలంగా ఏర్పాటు చేసేందుకు గతనెల 17 నుంచి ఈ నెల 2 వరకు వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించామని తెలిపారు. అనంతరం మేజర్ పంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఇఒఆర్‌డి నగేష్, సర్పంచి హైమావతి, ఉప సర్పంచి ఖాసీం, టిడిపి మండల కన్వీనర్ నజీర్ సాహెబ్, వైసిపి యువ నాయకులు బందే నవాజ్, టిడిపి నాయకులు చంద్రశేఖర్, షేక్షావలీ, అక్బర్ వలీ, పంచాయతీ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో 'ఉపాధి' నిధులే కీలకం

- సర్పంచి సుశీలమ్మ, ఎపిఒ మాధవ శంకర్

ప్రజాశక్తి - చిప్పగిరి

మాట్లాడుతున్న సర్పంచి సుశీలమ్మ, ఎపిఒ మాధవ శంకర్

గ్రామాలాభివృద్ధిలో ఉపాధి హామీ నిధులే కీలకమని సర్పంచి సుశీలమ్మ, ఎపిఒ మాధవ శంకర్ తెలిపారు. బుధవారం బంటనహాల్ గ్రామంలో సర్పంచి సుశీలమ్మ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి ప్రమీల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో ప్రాధాన్యత ఉన్న అభివృద్ధి పనులను గ్రామ సభల ద్వారా గుర్తించి, తీర్మానం రూపంలో ఉన్నతాధికారులకు తెలిపి పరిష్కరించుకుంటామని అన్నారు. ఆయా గ్రామాల్లో సర్పంచుల అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామసభలను నిర్వహించినట్లు ఎంపిడిఒ సివి.కొండయ్య తెలిపారు. టిడిపి నాయకులు సురేష్ పాల్గొన్నారు.

ఏజెంట్ల సంక్షేమంలో లియాఫీ పాత్ర గొప్పది

- లియాఫీ బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, జయన్న

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఏజెంట్ల సంక్షేమంలో లియాఫీ పాత్ర గొప్పదని లియాఫీ బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, జయన్న, ఆర్థిక కార్యదర్శి వీరేష్, జోనల్, డివిజన్ నాయకులు రంగస్వామి, రమేష్, ఆంధ్రయ్య పేర్కొన్నారు. బుధవారం లియాఫీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎల్ఐసి బ్రాంచి కార్యాలయంలో గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లియాఫీ నాయకులు, బ్రాంచి మేనేజర్ పులి నాయక్, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ సంతోష్ కుమార్, సీనియర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పాటిల్ తిమ్మారెడ్డి మాట్లాడారు. ఏజెంట్ల సంక్షేమానికి లియాఫీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా బ్రాంచి కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. అలాగే గాంధీ సర్కిల్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలోని వీవర్స్ కాలనీలోని వేదాస్ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి బియ్యం, కందిపప్పు, మంచి నూనె ప్యాకెట్లను అందజేశారు. సీనియర్ ఏజెంట్లు పంపన్న, వెంకటేశప్ప రాజు, తిరుపతి రమేష్ బాబు, షబ్బీర్ సాహెబ్, అనంత భూరళి, వెంకటేశ్వర్ రెడ్డిని సన్మానించారు. సీనియర్ ఏజెంట్ తన 60వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఏజెంట్లందరికీ భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు.

సీనియర్ ఏజెంట్ రాజగోపాల్ శెట్టిని సన్మానిస్తున్న సభ్యులు

రాయితీ మాయే..!

- సబ్సిడీ శనగ విత్తనాలతో ప్రయోజనం శూన్యం
- బహిరంగ మార్కెట్‌లో క్వింటా శనగ రూ.7,200
- ప్రభుత్వం చెబుతున్నది రూ.9,400
- సబ్సిడీ ధర రూ.7,050

ప్రజాశక్తి - ఆలూరు

సబ్సిడీ శనగ విత్తనాల పేరుతో ప్రభుత్వం, అధికారులు రైతులను మాయ చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటా శనగ రూ.7,200 ఉండగా ప్రభుత్వం, అధికారులు రూ.9,400లుగా చెబుతున్నారు. రూ.9,400లో 25 శాతం సబ్సిడీతో రూ.7,050లకు రైతులకు విత్తనాలను అందిస్తున్నారు. దీని వల్ల రైతులకు ఏమాత్రం ప్రయోజనం చేకూరడం లేదు.

సాగు చేసిన శనగ పంట (ఫైల్)

ప్రభుత్వ పెద్దలు, అధికారుల చేతివాటం రైతులకు శాపంగా మారింది. బహిరంగ మార్కెట్‌లో క్వింటా శనగ ధర రూ.7,200 ఉండగా ప్రభుత్వం మాత్రం క్వింటా రూ.9,400లుగా నిర్ణయిస్తూ 25 శాతం సబ్సిడీ ఇస్తూ అన్నదాతను ఆదుకుంటున్నామని చెబుతోంది. బహిరంగ మార్కెట్‌లో రూ.7,200 ఉండగా సబ్సిడీ ధర రూ.7,050 ఉండడంతో రైతుకు క్వింటాకు రూ.150 మాత్రమే మిగులుతోంది. సబ్సిడీ శనగ విత్తనాల కోసం రైతులు రెండు, మూడు సార్లు రైతు కేంద్రాలకు తిరిగితే ఆ మాత్రం మిగులు కూడా ఉండదు.

రూ.9,400 ధర ఎందుకు..?

బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.7,200 ఉండగా అధికారులు మార్క్ ఫెడ్ నుంచి రూ.9,400కు కొనడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. దళారి, మార్క్ ఫెడ్ అధికారులు, ప్రభుత్వ అధికారుల చేతివాటం వల్ల క్వింటా రూ.9,400కు కొనుగోలు చేసి ప్రభుత్వ సొమ్మును అప్పనంగా దోచేసుకుంటున్నారు.

29,600 హెక్టార్లలో పంట సాగు

జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల్లో ప్రధానంగా రబీ సీజన్‌లో పప్పు శనగ పంట సాగవుతోంది. ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో నల్లరేగడి భూములు అధికంగా ఉండడం వల్ల పప్పు శనగను ఎక్కువ సాగు చేస్తారు. ఆలూరు సబ్ డివిజన్‌లో 35,407 హెక్టార్లలో పప్పు శనగ పంట సాగు విస్తీర్ణం కాగా 29,600 హెక్టార్లలో పంట సాగు అవుతోంది. ఆలూరు సబ్ డివిజన్‌లోని ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి మండలాల్లో ప్రధానంగా సాగవుతోంది. పత్తికొండ తాలూకాలో పత్తికొండ, తుగ్గలి, వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల్లో ఎక్కువగా సాగవుతోంది.

40,745 క్వింటాళ్లు మంజూరు

జిల్లా వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి 54,179 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు పంపగా 40,745 క్వింటాళ్లు మంజూరయ్యాయి. ఆలూరు మండలానికి 8,762 క్వింటాళ్లు, ఆస్పరి 7,655, చిప్పగిరి 12,761, దేవనకొండ 1,100 క్వింటాళ్లు మంజూరయ్యాయి.

రైతులకు 50శాతం సబ్సిడీ ఇవ్వాలి

- ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

మార్కెట్ ధర రూ.7,200 కంటే ప్రభుత్వ ధర రూ.9,400 ఎక్కువగా ఉంది. అధికారులు, మార్క్ ఫెడ్ అధికారుల చేతివాటం వల్ల రైతుల నడ్డి విరుస్తున్నారు. ప్రభుత్వం స్పందించి 50 శాతం సబ్సిడీ ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

ఏ మాత్రం సరిపోదు...

- పరమేష్ గౌడ్, రైతు, ఆలూరు

ప్రభుత్వం అందిస్తున్న 25 శాతం సబ్సిడీ ఏ మాత్రం సరిపోదు. బహిరంగ మార్కెట్‌లో రూ.7,200 ఉంటే ప్రభుత్వం సబ్సిడీతో రూ.7,050కు ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం ఏ మాత్రం బాగోలేదు. రైతు బాగుండాలంటే 50 శాతం సబ్సిడీ ఇవ్వాలి.

కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం

- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం

- ఘనంగా కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడదామని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం తెలిపారు. బుధవారం కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కెవిపిఎస్ కార్యాలయంలో, శివ సర్కిల్‌లో, సోమప్ప సర్కిల్‌లో కెవిపిఎస్ జెండావిష్కరణలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేటికీ దళితులపై కొనసాగుతున్న అంటరానితనం, కుల వివక్ష, అణిచివేతకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ వృత్తి చర్మకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుమాల ఆంథోని, కెవిపిఎస్ మండల అధ్యక్షులు కోటేకల్ చిన్నప్ప, కెవిపిఎస్ నందవరం మండల ప్రధాన కార్యదర్శి నరసింహ, కెవిపిఎస్ నాయకులు అరుణ్, గుంటప్ప, కలగొట్ల ఈరన్న, మాచాపురం గంగన్న పాల్గొన్నారు. **గోనెగండ్ల**లో పతాకావిష్కరణ చేపట్టారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్, టిడిపి నాయకులు నూర్ అహ్మద్, రాంపురం రఫీక్, కెవిపిఎస్ నాయకులు మారేష్, తాయప్ప, నరసింహుడు, సల్వాది రంగన్న పాల్గొన్నారు. **మంత్రాలయం** ఆర్‌టిసి బస్టాండ్ వద్ద కెవిపిఎస్ జెండాను ఆవిష్కరించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, నాయకులు అంజి, ఆంధ్రయ్య పాల్గొన్నారు. **కౌతాళం**లోని అంబేద్కర్ సర్కిల్‌లో జెండా ఆవిష్కరణ చేపట్టారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు చిన్న మారయ్య, వీరేష్, బసవరాజు, ఆదాం, వీరేష్, భాస్కర్, లింగప్ప, ఎల్లప్ప పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న నాయకులు

దేశం గొప్ప నాయకులు కోల్పోయింది

- సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం - సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అభ్యుదయ భావాలు, శాస్త్రీయ దృక్పథం, ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన సీతారాం ఏచూరిలాంటి గొప్ప నాయకుని దేశం కోల్పోయిందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ తెలిపారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తమ కర్తవ్యమని చెప్పారు. బుధవారం పట్టణంలోని తేర్ బజారులో ఉన్న పద్మశాలి కల్యాణ మండలంలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. సిపిఎం డివిజన్ కార్యదర్శి గోవిందు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు, జిల్లా నాయకులు గోవిందు, ప్రజా వైద్యులు డాక్టర్ మాలకొండయ్య, ఎఐసిసి నాయకులు, మల్లెల గ్రూప్ ఛైర్మన్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, సిపిఐ జిల్లా నాయకులు పంపన్న గౌడ్, రంగన్న, టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న, సిపిఐ ఎంఎల్ రాజు, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు పంపావతి, పౌర హక్కుల సంఘం నాయకులు రామచంద్ర మాట్లాడారు. సీతారాం ఏచూరికి ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నప్పటికీ వాటిని త్యాగం చేసి ప్రజా పోరాటాలకు జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. 1974లో ఎస్ఎఫ్ఐలో చేరినప్పటి నుంచి ఉద్యమ పంథాను వీడలేదని చెప్పారు. విద్యార్థి నాయకునిగా నాటి ప్రధాని ఇందిరాగాంధీని యూనివర్సిటీలో నేరుగా విమర్శించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. దేశంలో మూడోసారి మతోన్మాద బిజెపి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. బిజెపి కార్మిక వర్గ ప్రయోజనాలను నిర్వీర్యం చేస్తుంటే కార్మిక, ఉద్యోగులను సంఘటితం చేసిన వ్యక్తి ఏచూరి అని తెలిపారు. నేడు దేశంలోనూ, రాష్ట్రంలోనూ పాలిస్తున్న ప్రభుత్వాల మతోన్మాద చర్యలను తిప్పి కొట్టడమే మన ముందున్న కర్తవ్యమని చెప్పారు. సిపిఎం, ప్రజా సంఘాలు, యుటిఎఫ్ నాయకులు హనుమంతు, రాముడు, సురేష్, దేవ సహాయం, నాగమణి, ఎల్లప్ప, దావీద్, దేవపాల్, నరసింహులు, రాఘవేంద్ర, మల్లారి నాగరాజ్, కర్రెన్న, గోవర్ధనమ్మ, శివలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

వైఎస్ఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- వైసిపి నాయకులు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని బాపులదొడ్డిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు ముక్కరన్న, అర్లప్ప డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. వైఎస్.రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసి పేదల సంక్షేమ కోసం అనేక పథకాలు అమలు చేశారని తెలిపారు. కేవలం రాజకీయ కక్షతోనే వైఎస్ఆర్ విగ్రహాన్ని కూల్చి వేశారని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాక్టర్ బోల్తా పడి మహిళ మృతి

ప్రజాశక్తి- దేవనకొండ

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు... మండలంలోని దుప్పనగుర్తి గ్రామ శివారులో గోనెగండ్ల మండలం ఒంటెడుదిన్నె గ్రామానికి చెందిన దాసరి చంద్రమ్మ (35) అనే మహిళ వేరుశనగ మిషన్ రోజువారీ పని నిమిత్తం ట్రాక్టర్ మీద కూర్చుని వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడగా అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇక నుంచి డబుల్ స్టాప్ బస్సులే

- డిపో మేనేజర్ అమర్‌నాథ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఎమ్మిగనూరు ఆర్‌టిసి డిపో నుంచి ఇక మీదట అన్ని బస్సు సర్వీసులు డబుల్ స్టాప్‌గా సాగుతాయని, సింగిల్ స్టాప్ సర్వీసులు ఉండబోవని డిపో మేనేజర్ అమర్‌నాథ్ తెలిపారు. ఎమ్మిగనూరు ఆర్‌టిసి డిపో నుంచి కర్నూలుకు వెళ్లే అన్ని సర్వీసులను గోనెగండ్ల, కోడుమూరులో ఆగేలా డబుల్ సర్వీసులుగా మార్చినందున బుధవారం ఆయన గోనెగండ్లకు విచ్చేసి ప్రయాణికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మిగనూరు నుంచి వెళ్లే ప్రతి బస్సు గోనెగండ్లలో ఆగుతుందని, 20కి పైగా బస్సులు గోనెగండ్ల, కోడుమూరు మీదుగా కర్నూలుకు వెళ్లే ప్రయాణికులకు సేవలు అందించనున్నాయని తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించి ప్రజలు ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించి ఇబ్బందులు పడకుండా ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. సిబ్బంది రంగస్వామి, శేఖర్ పాల్గొన్నారు.

'జనసేన' ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - ఆదోని

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన దీక్ష విరమణకు మద్దతుగా ప్రత్యేక పూజలు చేశామని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మల్లప్ప తెలిపారు. బుధవారం ఆదోనిలోని ఇందిరానగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కుంకుమార్చన, దీపారాధన చేశారు. జనసేన నాయకులు రేణు వర్మ, పులి రాజు, రాకేష్, ఎల్లప్ప, రాజేశ్వరి, ప్రకాష్, చంద్రశేఖర్ ఉన్నారు.

గాంధీ ఆశయాలు స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్యే పార్థసారథి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టర్

మహాత్మ గాంధీ ఆశయాలు ఎందరికో స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఆదోని మున్సిపల్ నెహ్రూ పీస్ పార్కులో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అహింస మార్గంలో ఉద్యమించి బానిస సంకెళ్లు తెంచి బ్రిటీష్ పాలకుల నుంచి దేశానికి విముక్తి కలిగించారని కొనియాడారు. గాంధీ బోధనలు నేటికీ అనుసరణీయమని తెలిపారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో

ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అందించి ప్రభుత్వ ఆశయాలను నెరవేరుస్తూ ముందుకు సాగాలని కోరారు.

టిడిపి ఆధ్వర్యంలో : టిడిపి ఆధ్వర్యంలో నెహ్రూ పీస్ పార్కులో గాంధీ విగ్రహానికి టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. గుడిసె ఆది కృష్ణమ్మ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గుడిసె ఆది కృష్ణమ్మ గాంధీ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

పట్టణంలోని నెహ్రూ పార్కులో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులరించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్ మాట్లాడుతూ... బిజెపి ప్రభుత్వం బ్రిటీష్ ప్రభుత్వం కన్నా దారుణంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజల తరఫున పోరాడితే సిబిఐ విచారణల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు దిలీప్ ధోకా, మారుతి, శ్రీనిత్, సాయినాథ్ ఉన్నారు.

అమరావతి పాఠశాలలో...

గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించామని అమరావతి పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ తెలిపారు. ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో గాంధీ లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్ గుప్తా, విశేష సభ్యులు వనపరాజు, ఓం ప్రకాష్, శంకర్, చాంద్‌బాషా పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో సిఇఒ తిరుమలరెడ్డి అధ్యక్షతన గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి కళాశాల పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల విద్యార్థులు గాంధీ జీవిత చరిత్ర, కవితలు, పాటలు వినిపించి బాపూజీపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం రావూస్ కళాశాల ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిసరాలను శుద్ధి చేశారు. కల్చరల్ ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జీ విజయ్ కుమార్, కల్చరల్ ప్రోగ్రామ్ స్క్రిప్ట్ రైటర్ పాల్ రాజు, సీనియర్ అధ్యాపకులు గోరంట్ల, వెంకటేశ్వర్లు, నూర్ బాషా, రామకృష్ణ, నరసింహులు, వీరేష్, నందిని, విజయరాజు, అన్నపూర్ణ, ఈరేషమ్మ, శ్రుతి ప్రియా, సంపత్, ధనుంజయ, గోవిందు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు (రూరల్)** మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతిని నిర్వహించారు. ముందుగా నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ పద్మావతి జ్యోతి ప్రజ్వలన చేశారు. వైస్ ప్రిన్సిపల్ కె.చంద్రన్, బసవరాజ్ పాల్గొన్నారు. **చిప్పగిరి** మండల కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపిడిఒ సివి.కొండయ్య, ఎంపిపి జూటూరు హేమలత భర్త, వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, ఎపిఒ మాధవ శంకర్ పాల్గొన్నారు. **నందవరం** మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపిడిఒ దశరథ రామయ్య, మండల విస్తరణ అధికారి ఈశ్వరయ్య స్వామి, సిబ్బంది పచ్చదనం, పరిశుభ్రత చేపట్టారు. **మంత్రాలయం**లోని రాఘవేంద్ర సర్కిల్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్య వైశ్య సేవా సంఘం కార్యదర్శి జి.వెంకటేష్, ఆర్యవైశ్యులు వాజన్నశెట్టి, దామోదర గుప్తా, బసవరాజు, కోల్గేట్ రమేష్, సాయిరామ్, అశ్వత్ శెట్టి, ఎం.రమేష్, వీరేష్ శెట్టి, సూర్య నారాయణ శెట్టి, చెక్క వెంకటేష్ శెట్టి, కె.రాఘవేంద్ర శెట్టి, రఘు, రమేష్, సూరి, రత్నయ్య శెట్టి, నవీన్, శ్రీనాథ్ పాల్గొన్నారు. **దేవనకొండ** మండల పరిషత్ కార్యాలయం, గ్రామ సచివాలయం, నేలతలమర్రి సచివాలయంలో ఎంపిడిఒ గౌరీదేవి, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, సర్పంచులు పద్మజ, రంగలక్ష్మి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచి నాగరాజు గౌడ్, వైసిపి నాయకులు హంపి రెడ్డి, కార్యదర్శి అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను గౌరవిద్దాం

చెత్త ఊడుస్తూ వీధులను శుభ్రం చేసే పారిశుధ్య కార్మికులను గౌరవించాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌తో కలిసి గాంధీ జయంతి సంబరాలు చేసుకున్నారు. గాంధీ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఆదోని మున్సిపాలిటీలో దశాబ్ద కాలంగా పారిశుధ్య పనులు చేసిన మహిళ కార్మికుల కాళ్లు కడిగి ఆ నీటిని తలపై చల్లుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు దరిచేరవని, అలాంటి త్యాగాలు చేస్తున్న పారిశుధ్య కార్మికులను గౌరవించాలని తెలిపారు. 30 మంది పారిశుధ్య కార్మికులను సన్మానించి వారికి ప్రశంసాపత్రం అందజేశారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ పాల్గొన్నారు.

చిప్పగిరిలో నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు

మాట్లాడుతున్న ఉమాపతి నాయుడు

నివాళులర్పిస్తున్న గుడిసె ఆది కృష్ణమ్మ

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆదోనిలో పారిశుధ్య కార్మికుల కాళ్లు కడుగుతున్న ఎమ్మెల్యే

మాట్లాడుతున్న తిక్కారెడ్డి

ప్రజాహితమే చంద్రబాబు ఆకాంక్ష

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎన్నికల వరకే పార్టీలు, వర్గాలని, ఎన్నికల తర్వాత రాష్ట్ర ప్రజలంతా బాగుండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్ష అని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి పేర్కొన్నారు. బుధవారం అమావాస్య సందర్భంగా స్థానిక శ్రీమఠం చేరుకున్న ఆయన రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి స్వగృహంలో ఆయన అధ్యక్షతన విలేకరులతో మాట్లాడారు. వరదకు అతలాకుతమైన విజయవాడ పరిసర ప్రాంతాల్లో పర్యటించి మంత్రులను, ఎమ్మెల్యేలను, అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు అప్రమత్తం చేసి పది రోజుల్లో యథాస్థితికి తెచ్చారన్నారు. 15 ఏళ్ల క్రితం తుంగభద్ర నది వరదలను మంత్రాలయం ప్రజలు కూడా అనుభవించారని, ఆ సమయంలో తనతో పాటు పన్నగ వెంకటేష్ స్వామి, వ్యాసరాజ స్వామితో కలిసి మానవత్వంతో సహాయం చేశామన్నారు. ఆ సమయంలో చంద్రబాబు పాలన ఉంటే త్వరగా స్పందించేవారని చెప్పారు. రామచంద్ర నగర్ కాలనీ వాసులు ఈ సమస్యను అధికంగా ఎదుర్కొంటున్నారని చెప్పారు. అనంతరం రాఘవేంద్ర సర్కిల్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, ఎస్ఐ పరమేష్ నాయక్, టిడిపి కోసిగి మండల నాయకులు భరద్వాజ్ శెట్టి, మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు అమర్‌నాథరెడ్డి, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, నాయకులు కృష్ణ మోహన్ రెడ్డి, వట్టెప్ప గారి చిన్న సుంకప్ప, వనికె నాగరాజు, గనేకంటి రఘు, గనేకంటి రామకృష్ణ, విద్యా కమిటీ ఛైర్మన్ గనేకంటి గురురాజ్, మద్రి ఏబు, మైనార్టీ నాయకులు అబ్దుల్, తిక్కస్వామి గౌడు, ఈరన్న, నారాయణ ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా శకుంత సర్కిల్‌లోని గాంధీ విగ్రహానికి నివాళులర్పించి, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు నాగమణి, ఎల్లప్ప, దావీద్, దేవపాల్, నరసింహులు మాట్లాడారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉందని తెలిపారు. ఎస్‌జిటి పండిట్, పిఇటి పోస్టులను అప్ గ్రేడ్ చేసి మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రమోషన్స్ కల్పించాలని కోరారు. ఈనెల 17న విజయవాడలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయం దగ్గర ధర్నా చేపడతామని హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా పూర్వ గౌరవాధ్యక్షులు ఎం.పంపాపతి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కౌలన్న, సీనియర్ నాయకులు కె.నాగరాజు, మండల బాధ్యులు చంద్రపాల్, ఎం.రాజు, ఎస్.సుధాకర్, ఎం.సుధాకర్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం

- ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని బోడబండ గ్రామంలో స్వచ్ఛత హి సేవా గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బీవీ హాజరయి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల్లోనే అనేక హామీలను నెరవేర్చిందని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రమే ప్రజలు గుర్తొచ్చే నాయకులకు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల మధ్య ఉండే నాయకులకు తేడాను ప్రజలందరూ చూస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో ఏ అధికారి ఎక్కడ ఉంటారు.. గ్రామానికి ఎవరెవరు వస్తున్నారు.. ఎందుకు వస్తున్నారన్న విషయం ప్రజలకు తెలిసేది కాదని చెప్పారు. నేడు వచ్చే ప్రతి ప్రభుత్వ అధికారి దేనికోసం వస్తున్నారు ప్రజలందరికీ తెలుసని అన్నారు. త్వరలోనే ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ప్రజాదర్బార్ ఏర్పాటు చేస్తానని, ప్రజల సమస్యలు నేరుగా తనతో చెప్పుకునే అవకాశం కల్పిస్తున్నానని తెలిపారు. టిడిపి మండల అధ్యక్షుడు పార్లపల్లి మల్లికార్జున, టిడిపి కురువ సాధికారిక కమిటీ సభ్యులు కెటి.వెంకటేష్, పెద్దమర్రివీడు మల్లయ్య, బోడబండ సురేష్, లోకి రెడ్డి, బనవాసి ధనుంజయ, చిన్నపురం నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయి

కమిషనర్ రవీంద్రబాబు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం అవుట్ డోర్ స్టేడియంలో స్కేటింగ్ రింక్ వద్ద జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలను కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. జిల్లాస్థాయి స్కేటింగ్‌లో గెలుపొందిన విజేతలు, వచ్చే నెల 6 నుండి 10 వరకు కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.సునీల్ కుమార్, కోశాధికారి అబుబాకర్, జిల్లాస్కేటింగ్ సంఘం కార్యవర్గ సభ్యుడు కాకాని సత్యం, సంయుక్త కార్యదర్శి అన్నం పునీత చౌదరి, షాహీన్‌భాను, పాండు, రంగప్రసాద్, అవినాష్ శెట్టి, రోలర్ స్కేటింగ్ రాష్ట్ర పరిశీలకులు బి.ఆంజనేయులు పర్యవేక్షకులు, కె.రాజశేఖర్, పునీత్ కుమార్ రెడ్డి, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

చలో బ్యాంకాక్ వయా డ్రెస్ సర్కిల్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రతి రూ.1000 కొనుగోలుపై బంపర్ డ్రాలో బ్యాంకాక్ ట్రిప్ ప్రతిరోజు లక్కీ డ్రాలో ఒకరికి విలువైన బహుమతి,ప్రతి మూడు వేల రూపాయల కొనుగోలుపై స్పాట్ గిఫ్ట్ ఇస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

కర్నూల్ నగరంలోని అబ్దుల్లా ఖాన్ స్టేట్ నందుగల డ్రెస్‌సర్కిల్ షాపింగ్ మాల్‌లో దసరా దీపావళి సెలబ్రేషన్స్ ప్రారంభమయ్యాయి. అన్ని రకాల వస్త్రాలపై భారీ తగ్గింపు ఆఫర్స్ నడుస్తున్నాయి. సారీస్ విభాగంలో గరీమ ప్రింటెడ్ , సిల్వర్ లినెన్ , రిచ్ ఫీల్డ్ ,కేరళ ప్రింటెడ్ మల్ మల్ కాటన్స్ ,పరిణయ పట్టు ,బెంగాల్ కాటన్ ,ఖాదీ కాటన్, ప్రింటెడ్ సాఫ్ట్ అవంతిక పట్టు సాముద్రిక పట్టు ,కంచి టిష్యూ పై కాంబో ఆఫర్ కలవు. చుడిదార్స్ అండ్ డ్రెస్ మెటీరియల్స్ లేడీస్ వెస్ట్రన్ వేర్ పై అమోఘమైన కాంబో ఆఫర్లున్నాయి. కిడ్స్ వేర్ మెన్స్ వేర్ పై ప్రత్యేకమైన కాంబోఆఫర్స్ , సెలెక్టెడ్ ఐటమ్స్ బై వన్ గెట్ వన్ ఆఫర్ కలదు. బ్రాండెడ్ దుస్తులపై 40శాతం దాకా డిస్కౌంట్ ఉన్నారు. ఈ ఆఫర్ సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 31వరకు మాత్రమేనని తెలిపారు.

మోడీ అభివృద్ధి చేసిందేమీ లేదు

రాష్ట్ర కాంగ్రెస్ నేత రామకృష్ణ యాదవ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మోడీ దేశంలో అభివృద్ధి చేసిందేమీ లేదని అప్పులు మాత్రమే చేశారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ యాదవ్ విమర్శించారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ , మాజీ ప్రధానమంత్రి లాల్ బహుదూర్ శాస్త్రి జయంతిని డిసిసి అధ్యక్షుడు పి మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ యాదవ్ పాల్గొని గాంధీజీ , లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అనాథఆశ్రమంలో చిన్నారులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీని గద్దె దింపితే తప్ప ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందవన్నారు. గాంధీజీ స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ముందుకు సాగాలని కోరారు. మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు, షేక్ జిలానిబాష, దామోదరం రాధాకృష్ణ, స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ పీజీ నరసింహులు యాదవ్, ఎన్‌సి బజారన్న, కె.వెంకటరెడ్డి, రియాజుద్దీన్ ఎస్ ప్రమీల, ఎ. వెంకట సుజాత, కె.రాఘవేంద్రరెడ్డి, సాయికృష్ణ, షేక్ ఖాజా హుస్సేన్, ఖాద్రి పాషా, అనంతరత్నం, ఈ లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

పొంతనలేని సమాధానాలు

- విచారణకు హాజరైన మాజీ మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసంపై దాడి కేసులో వైసిపి నేత, మాజీ మంత్రి జోగి రమేష్‌కు బుధవారం విచారణకు హాజ రయ్యారు. విచారణ అనంతరం డిఎస్‌పి మురళీకృష్ణ మీడియాతో మాట్లాడుతూ... ఇతర ముద్దాయిలు చెప్పిన సాక్ష్యాలకు, మొదటి ముద్దాయి జోగి రమేష్ చెప్పిన సాక్ష్యాలను పొంతన లేదన్నారు. అవసరమైతే మళ్లీ నోటీసులు ఇచ్చి విచారణకు పిలిపిస్తామని తెలిపారు. వారికి సంబంధించిన సోషల్ మీడియా ఖాతాలను కూడా తనిఖీ చేస్తున్నామని, వారి మొబైల్ ఫోన్ సిమ్ కార్డులను అడిగితే ఇప్పుడు అవి వాడటం లేదని చెప్పారన్నారు. ఇప్పటివరకు ఈ కేసులో మొత్తం ఎనిమిది ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి తెలియజేశారు.

కుల నిర్మూలనకు పోరాటానికి సిద్ధం కండి :కెవిపిఎస్

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

జెండాను ఎగుర వేసి నినాదాలు చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

కర్నూలు నగరంలోని 23 వ వార్డు శ్రీరామ నగర్ చైతన్య స్కూల్ దగ్గర కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జండా ఆవిష్కరణ చేశారు. కెవిపిఎస్ వార్డు అధ్యక్షులు వై.జాన్సన్ అధ్యక్షత వహించారు. వీధి పెద్దలు జి.రత్నం కెవిపిఎస్ జెండా ఆవిష్కరణచేశారు. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలనకు పోరాడుతాం, అంబేద్కర్ చూపిన మార్గాన్ని పయనిస్తామంటూ పెద్ద ఎత్తున నినాదాలుచేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కెవిపిఎస్ నగర అధ్యక్షులు జి.ఏసు రాజు, కెవిపిఎస్ మాజీ నగర కార్యదర్శి ఆర్.నరసింహులు, కెవిపిఎస్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు కె.ఈశ్వరయ్య, కెవిపిఎస్ వార్డ్ కార్యదర్శి పి.బాబురావు లు కార్యక్రమానికి విచ్చేసిన దళితులనుదేశించి మాట్లాడుతూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఏర్పడిన నాటినుండి ఆత్మగౌరవం సమానత్వం కుల నిర్మూలనకై నిరంతరం పోరాటం చేస్తూ దళితుల హక్కులకై రాజులేని పోరాటం నిర్వహిస్తూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగంలో కల్పించిన హక్కులను దళిత సోదరులకు అందే విధంగా చేయటంలో పున్నయ్య కమిషన్‌ను ఏర్పాటు చేయించి ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ సాధించడంలో ఘన విజయం సాధించిందన్నారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన ఇప్పటికీ కర్నూలు జిల్లా హెడ్ క్వార్టర్‌కు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి గ్రామాల్లో ఇప్పటికీ అంటరానితనం కొనసాగుతున్నదన్నారు. చెరువులలో దిగనీయకుండా ఆపడం, మంగళ సౌరం చేయనీయకపోవడం దేవాలయాల్లోకి రానియకపోవడం, కులాంతర వివాహం చేసుకున్న వారిపై దాడులు చేయడం ఇలాంటి దుర్మార్గపు చర్యలు జరుగుతున్న జిల్లా ఎస్‌పి జిల్లా కలెక్టర్లు పట్టించుకోక పోవడం చాలా దురదృష్టకరమన్నారు. ఈ జిల్లాలో ఎన్నికైనటువంటి ఉన్న ఎమ్మెల్యేలు ఎంపీలు, దళితులతో ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిదళితులపై దాడులు దౌర్జన్యాలు, అంటరానితనం, అస్పృశ్యతపాటిస్తుంటే ఏమాత్రం పట్టించుకోకుండా కళ్ళు లేని కబోదుల వలె వ్యవహరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలునూతన విద్యా విధానం చట్టాన్ని తీసుకొని వచ్చి ఎలిమెంటరీ స్కూల్ లను ఎత్తివేస్తూ ఒకటి రెండు తరగతులను అంగన్వాడి కేంద్రాలకు అప్పజెప్పి మూడు నాలుగు ఐదు తరగతులను హైస్కూల్‌కు పంపి విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ దళితులకు చదువును దూరం చేయాలనే కుట్ర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయి. కాబట్టే దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధం కావాలని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు ఉన్నత పదవుల్లోకి డాక్టర్లు ఎస్పీలు కలెక్టర్లుగా అవుతున్నారని దురుద్దేశంతో చదువును దూరం చేయాలనే కుట్ర జరుగుతున్నది. చదువు ఒక అమ్మకపు వస్తువు లాగా చేయాలని ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయి. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చదువే విజ్ఞానాన్ని ఇస్తుందన్నారు. అదే సంపదనిస్తున్నారు. చదువే నీకు పదవినిస్తుంది చదివే నీకు గౌరవాన్ని కలిగిస్తుందని ఆనాడే చెప్పాడు. అలాంటి చదువును దూరం చేయాలని ఈరోజు ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయి. దళిత సోదరులందరూ మేల్కొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ వార్డు నాయకులు జి. ఆంజనేయులు, పి.నాగరాజు, రాజు, వై.నల్లన, వై.శంకర్, నడిపి తిమ్మన్న, వీధిపెద్దలువెంకటేశ్వర్లు, మునిస్వామి, శేఖర్, ఎం.హనుమంతు, ఆర్,రాజు, బుజులు, బి.సంజన్న తదితరులు పాల్గొన్నారు.

చందనా బ్రదర్స్ వారి దసరా సిగ్నేచర్ డిస్కౌంట్స్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని చందనా బ్రదర్స్‌లో దసరా డిస్కౌంట్ సేల్ ప్రారంభమయ్యాయి. హ్యాపీ దసరా హ్యాపీ డిస్కౌంట్ పండగ సరదా మీది డిస్కౌంట్ హామీ మాది అనే నినాదంతో చందన బ్రదర్స్ ఈ దసరాకి మన ముందుకు వచ్చింది. జువెల్లరీ విభాగంలో 916 బంగారు ఆభరణాలపై అత్యంత తక్కువ తరుగు 4.8శాతం నుంచి ప్రారంభమవుతుంది. క్రిస్టల్ సారీస్ కాశీ పట్టు, న్యాచురల్ సిల్క్ బ్లూ బెర్రీ సిల్క్స్ , పైఠానీ సరీస్ , కలంకారి సారీస్ ,లైట్ వెయిట్ కేటలాగ్ సారీస్, ఆన్లైన్ సారీస్ ప్రత్యేక కౌంటర్లో 39శాతం,49శాతం , 1:1:1:2 ఆఫర్స్‌తో లభిస్తాయి. అన్ని రకాల సారీస్‌పై ప్రత్యేక డిస్కౌంట్ కలవు. లేడీస్ వేర్ ,మెన్స్ వేర్, కిడ్స్ వేర్ పై ఆకర్షణీయమైన ఆఫర్స్ ఉన్నాయి.

పెన్షన్ల పంపిణీలో అగ్రస్థానంలో జిల్లా

కర్నూలు కలెక్టరేట్ : అక్టోబర్ మాసంలో కూడా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో 99.13 శాతంతో కర్నూలు జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది..జిల్లాలో మొత్తం 2 లక్షల 41 వేల 843 పెన్షన్‌లు ఉండగా అందులో 2 లక్షల 39 వేల 742 పెన్షన్ లను పంపిణీ చేసి 99.13 శాతంతో జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని కలెక్టర్ తెలిపారు.

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత: మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్ : వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల 'స్వచ్ఛత' ప్రతి ఒక్కరి జీవన విధానం కావాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టిజి. భరత్ పేర్కొన్నారు. బుధవారం గార్గేయపురం డంపింగ్ యార్డు వద్ద ఎమ్ఆర్ఎఫ్ (మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ) ప్లాంట్ నిర్మాణానికి మంత్రి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష, కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, మేయర్ బి.వై. రామయ్య, ఎమ్మెల్యేలు గౌరు చరిత రెడ్డి, బొగ్గుల దస్తగిరి, కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు శంకుస్థాపన చేశారు. గత నెల 17వ తేదీ నుండి స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలు చేపట్టిన నగరపాలక సంస్థ చివరి రోజు గాంధీ జయంతి నాడు'స్వచ్ఛ భారత్ దివస్ – 2024' కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. అందులో భాగంగా రూ.9.88 కోట్లతో స్వచ్ఛ్ భారత్ మిషన్ 2.0, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులతో ఎంఆర్ఎఫ్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. 5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ ప్లాంట్ రానున్న ఆరు నెలల్లో పూర్తి కానుందన్నారు. వీటి వల్ల ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేయడం, పొడి చెత్తతో ఎరువును తయారు చేయడం, ఇతర జడ వ్యర్థాలతో భవన, రహదారుల నిర్మాణాలకు ఉపయోగించడం వంటివి చేయవచ్చునని మంత్రి అన్నారు. అక్టోబర్ 2 అనగానే కర్నూలుకు వరద వచ్చిన సంగతి గుర్తుకు వస్తుందని, దానిని గుర్తు చేసుకుంటే ప్రకృతి విపత్తులు ఎంత భయంకరంగా ఉంటాయో అర్థం చేసుకోవచ్చన్నారు. అందుకే పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రానున్న రోజుల్లో గార్గేపురం డంప్ యార్డు పరిసరాల ప్రజలు ఎలాంటి వ్యాధుల బారినపడకుండా మంచి వాతావరణం నివాసాలు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. వచ్చే ఏప్రిల్‌లో ఎంఆర్ఎఫ్ ప్రారంభిస్తామని, ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపడతామని పేర్కొన్నారు. పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ గాంధీ జయంతి రోజును పురస్కరించుకొని గార్గేయపురం వద్ద ఉన్నటువంటి డంపు యార్డులో తడి చెత్త పొడి చెత్తను వేరుచేసి రీసైకిలింగ్ చేయడానికి సాయి పావని కన్సల్టేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి ద్వారా ఎమ్.ఆర్.ఎఫ్ (మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ)యూనిట్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించుకున్నామన్నారు. పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు ఎలాంటి హాని కలవకుండా ఉండుట కొరకే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఎంపీ అన్నారు. ఈ యూనిట్ నుండి వచ్చే బైక్ ప్రొడక్ట్స్ కూడా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వాలు ఈ కార్యక్రమాలను చేపట్టాయి అని ఎంపీ అన్నారు. జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా మాట్లాడుతూ ఈ రోజు గాంధి జయంతి సందర్భంగా మనం గత 15 రోజులగ స్వచ్ఛతాహిసేవా, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించుకున్నామని, మొదటి రోజున జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు మానవహారం కార్యక్రమాలు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు, జిల్లాలో ప్రతి గ్రామంలోని మురుగు కాలువలను శుభ్రం చేయడం సాలిడ్ వేస్ట్‌ను తొలగించడం వంటి కార్యక్రమాలు జిల్లాలోని అన్ని గ్రామా పంచాయితీలలో గత 15 రోజుల నుంచి నిర్వహించామన్నారు., దాదాపు 5, 000 ఈవెంట్స్‌ను పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ తదితర శాఖలు స్వచ్ఛంద సంస్థల వారు ప్రజలు సహకారంతో నిర్వహించుకున్నామని అన్నారు. ఈరోజు

ఎమ్ఆర్ఎఫ్ (మెటీరియల్ రికవరీ ఫెసిలిట్) ప్లాంట్ నిర్మాణానికి మంత్రి టిజి.భరత్ , జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష, కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, మేయర్ బివై. రామయ్య, ఎమ్మెల్యేలు గౌరు చరిత రెడ్డి, బొగ్గుల దస్తగిరి, తదితరులు

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.9.88 కోట్ల వ్యయంతో ఎమ్.ఆర్.ఎఫ్ (మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ)యూనిట్‌కు శంకుస్థాపన నిర్వహించుకుంటున్నామన్నారు. దీని ముఖ్య ఉద్దేశం ఇక్కడ ఉన్నటువంటి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇక్కడికి వచ్చేటువంటి చెత్తాచెదారులను సెగ్రిగేట్ చేసి అందులో నుండి వచ్చేటువంటి పదార్థాలతో బై ప్రొడక్ట్స్ తయారు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు ముఖ్యంగా విజ్ఞప్తి చేయడమేమంటే ప్రజలందరూ వ్యక్తిగతంగా , సామాజికంగా పరిశుభ్రతను పాటించినప్పుడే మనం విజయాలు సాధించగలుగుతామని కలెక్టర్ పేర్కొన్నారు. పాణ్యం శాసనసభ్యులు గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ గాంధీ జయంతి సందర్భంగా వారి ఆశయాలకు అనుగుణంగా మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వ తేదీ వరకు నిర్వహించుకున్నామని, బుధవారం గార్గేయపురం పరదిలోని డంప్ యార్డు నందు దాదాపు 10 కోట్ల రూపాయల వ్యయముతో యం ఆర్ ఎఫ్ (మెటీరియల్ రికవరీ ఫెసిలిటి) యూనిట్ కొరకు భూమి పూజ కూడా నిర్వహించుకున్నామన్నారు.

కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ, కర్నూలు నగరంలోని చెత్తాచెదాలను గార్గేయపురము పరది లోని డంప్ యార్డు కు తరలిస్తున్నారన్నారు. వీటిని శ్రీ సాయి ఏజెన్సీ వారి ద్వారా ఇక్కడ ఉన్న తడి పొడి చెత్తను వేరుచేసి మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ యూనిట్ ద్వారా వేరు చేయడం జరుగుతుందన్నారు. తద్వారా వచ్చిన వేస్టేజ్ ని కూడా పొలాల్లో ఎరువుగా వినియోగించుకోన్న వచ్చునని ఆయన అన్నారు. మేయర్ మాట్లాడుతూ 15 రోజులుగా స్వచ్ఛత హి సేవలో భాగంగా నగరపాలక వివిధ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఎంఆర్ఎఫ్ ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. దీనిని గాంధీ జయంతి నాడు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని పిలుపునిచ్చారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారాలతో, ప్రజప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో నగరాన్ని తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కమిషనర్ ఎస్ రవీంద్రబాబు మాట్లాడుతూ మనుషులు కలిసి ఉంటే బలం, ప్రగతి సాకారం అవుతుందని, అదే వ్యర్థాలు కలిసి ఉంటే చాలా ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. వాటి ఆవశ్యకతను గుర్తించి, ఎంఆర్ఎఫ్ నిర్మాణానికి నాంది పలికామన్నారు. హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారు లు మొక్కలు నాటినారు, స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి, బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో ఆర్డిఓ శేషిరెడ్డి, తహశీల్దార్ రమేష్‌బాబు, డిప్యూటి మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు ఎం.విక్రసింహా రెడ్డి, పరమేష్, రమణమ్మ, జకియా అన్సారీ, ఆరోగ్యధికారి డా.వి. విశ్వేశ్వర రెడ్డి, ఎస్.ఈ జి.రాజశేఖర్, ఎంఈ సత్యనారయణ, డిఇఇ నరేష్, ఎఇ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న పవన్‌కల్యాణ్

- ప్రాయశ్చిత్త దీక్ష విరమణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల శ్రీవారిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బుధవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శన సమయంలో తన ఇద్దరు కుమార్తెలు ఆద్య, పొలెనా అంజలి దర్శించుకున్నారు. 'వారాహి' డిక్లరేషన్‌ను శ్రీవారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాయశ్చిత్త దీక్ష విరమించారు. ఆలయం వెలుపల వారాహి డిక్లరేషన్ ప్రతులను మీడియాకు చూపించారు. అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్నదాన కేంద్రంలో యాత్రికులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. క్రైస్తవాన్ని స్వీకరించిన చిన్న కుమార్తె పొలెనా అంజలితో ఆలయ నియమాలను అనుసరించి డిక్లరేషన్ ఇప్పించారు. గురువారం సాయంత్రం తిరుపతిలో జరగనున్న వారాహి సభలో పవన్ పాల్గొననున్నారు. ఆయన వెంట శాసనమండలి సభ్యులు పిడుగు హరిప్రసాద్, తిరుపతి రైల్వేకోడూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

కోడుమూరులో గాంధీ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

కోడుమూరులో గాంధీజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన గాంధీ జయంతి వేడుకలు చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మన్న అధ్యక్షతన గాంధీ జయంతి వేడుకలు చేనేత కార్మికులతో కలిసి పాత బస్టాండ్ గాంధీ విగ్రహం నందు గాంధీ విగ్రహానికి చేనేత చీర నేసే నూలు దారంతో పూలమాల రూపంలో వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాజు, సిపిఎం మండల కార్యదర్శి గఫూర్‌మియా, సిఐటియు మండల కార్యదర్శి జిపి వీరన్న హాజరై మాట్లాడారు. మహాత్మా గాంధీ కలలుగన్న భారత దేశంలో గ్రామ స్వరాజ్యం బాగుపడాలని అర్ధరాత్రి మహిళా ఒంటరిగా తిరిగినప్పుడే ఈ దేశానికి స్వతంత్రం వచ్చినట్లు భావించాలని ఆయన అన్నారు. అలాంటిది ఈరోజు దేశంలో మహిళలపై ఎన్నో రకాల అరాచకాలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. మహిళలకే కాదు ఇతర ఇతర కార్మికులకు కూడా రక్షణ లేకుండా పోతుందన్నారు. గాంధీజీ గారు చెప్పిన ప్రకారం మానవ మనుగడ కొనసాగాలంటే కూడు. గుడ్డ. అవసరం వాటిని తయారు చేసేది ఒకటి రైతు రెండవది చేనేత కార్మికుడు అలాంటిది దేశంలో వీరిద్దరికీ రక్షణ లేకుండా పోతుందన్నారు. ఈరోజు రైతులు పండించిన పంట గిట్టుబాటు ధర లేక పెరిగిన ఎరువుల ధరల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం లేక తెచ్చిన అప్పులు తీర్చుకోలేక కుటుంబాలను పోషించలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రెండవది మనిషి అనే వాడు నేను అని బయట తిరగాలంటే అందుకు ఒంటినిండా బట్టలు ఉండాలి ఆ బట్టలను తయారు చేసే చేనేత కార్మికుడు నేసిన బట్టకు గిట్టుబాటు ధర లేక ముడి సరుకుల ధరలు పెరిగిపోయి ప్రతి ముడి సరుకు పై పిడుగు లాంటి జిఎస్‌టి భారం వేస్తూ చేనేత కార్మికులను తమ వత్తిని వదులుకొని పోయేలా చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహాత్మా గాంధీ యొక్క ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నం చేయాలన్నారు. రైతులను చేనేత కార్మికులను అన్ని రకాలుగా ఆదుకొని వారికి ఉపాధి కల్పించాలని వారి డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం చేనేత కార్మికులకు 200 యూనిట్లు ఉచిత కరెంటు ఇస్తామన్నారన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు శంకర్ శ్రీరాములు, బాబు ,వెంకటేష్,పాల శేఖర్,నాగరాజు , సత్యనారాయణ,విఠ్ఠలావు ,వెంకటేష్,పరమేష్ గిరి ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు లేక వలస

- దేవర పొదిలాం జడ్‌పి పాఠశాల నుంచి టిసి తీసుకున్న 98 మంది విద్యార్థులు
- శ్రీకాకుళం జిల్లాలోని వివిధ స్కూళ్లల్లో చేరిక
- ప్రభుత్వం నమ్మకం కల్పించలేకపోవడమే కారణం!

దేవర పొదిలాం జడ్‌పి పాఠశాల

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు పొరుగు జిల్లాలోని వివిధ పాఠశాలలకు వలసపోయిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇప్పుడు ఆ పాఠశాల ఉనికికే ప్రమాదం వాటిల్లింది. విద్యార్థులు తక్కువగా ఉన్నారనే నెపంతో పాఠశాల స్థాయిని తగ్గించడం లేదా ఉన్న పోస్టులను కుదించే ప్రమాదం కనిపిస్తోంది. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం దేవర పొదిలాం ప్రాథమిక పాఠశాల రెండేళ్ల క్రితమే జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయింది. అప్పటి వరకు 50 మంది విద్యార్థులకు పరిమితమైన ఈ స్కూల్లో గత విద్యా సంవత్సరం నాటికి విద్యార్థుల సంఖ్య 120 పెరిగింది. దీంతో, అప్పటికే ఉన్న నలుగురు ఉపాధ్యాయులకు తోడు మరో నలుగురిని వర్క్ అడ్జస్ట్‌మెంట్ పద్ధతిలో ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య 130కు చేరింది. ఈ దృష్ట్యా గతేడాది మాదిరిగా కనీసం ఎనిమిది మంది ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉంది. కానీ, ప్రభుత్వం అడ్జస్ట్‌మెంట్ పద్ధతిలో ఉపాధ్యాయులను సకాలంలో నియమించలేదు. దీంతో, తెలుగు, ఇంగ్లీష్, లెక్కలతో పాటు ఒక ఎస్‌జిటి టీచరు మాత్రమే ఉన్నారు. సైన్స్, సోషల్, హిందీ ఉపాధ్యాయులు లేరు. పిఇటి, డ్రాయింగ్ పోస్టుల ఊసే లేదు. మిగిలారు. సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో వారిని నియమిస్తారో లేదోనని తల్లిదండ్రుల్లో అనుమానం పెరిగింది. ఇలా సుమారు నెలరోజులపాటు వేచి చూసినప్పటికీ ప్రభుత్వంలో స్పందన లేకపోవడంతో జులై నెలాఖరు వరకు పిల్లలు పాఠశాలలకు వెళ్లడం తప్ప, ఆ సబ్జెక్టుల్లో పాఠాలు భోధించేవారు కరువయ్యారు. దీంతో, ఆందోళన చెందిన కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర స్కూళ్లకు పంపాలనే నిర్ణయానికి వచ్చారు. ఇలా కొంతమందిలో మొదలైన భావన క్రమంగా ఎక్కువమందికే పాకింది. ఈ ఏడాది జూన్ చివరి వారంలో మొదలైన టిసిలు తీసుకునే పర్వం ఆగస్టు మొదటివారం వరకూ కొనసాగింది. దేవర పొదిలాం, నిమ్మలవలస, చొక్కరపాలెం, గునిదాం తదితర గ్రామాలకు చెందిన పర్ల వరలక్ష్మి (10వ తరగతి), కురమాన వాణి (10వ తరగతి), నాస మహేష్ (10వ తరగతి, దనదాసి జయలక్ష్మి (9వ తరగతి), పినిపిల్లి గుణశేఖర్ (9వ తరగతి), చొక్కర తనూజ (8వ తరగతి) సహా మొత్తం 98 మంది విద్యార్థులు టిసిలు తీసుకొని శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం వెంకటాపురం ప్రభుత్వ పాఠశాల సహా ఆ చుట్టు పక్కల ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో చేరిపోయారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 50 మంది మాత్రమే మిగిలారు. ప్రభుత్వం ఆగస్టులో నిర్వహించిన బడిబాట జరిగే నాటికే విద్యార్థులు ఇతర స్కూళ్లకు వెళ్లిపోవడంతో అధికారులు ఏమీ చేయలేకపోయారు. ఆ తర్వాత వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరిట నలుగురు ఉపాధ్యాయులను నియమించినప్పటికీ, అప్పటికే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో దాన్ని ఉపసంహరించుకున్నారు. ఇదే సంఖ్య కొనసాగితే హైస్కూల్ స్థాయిని కూడా కోల్పోయే ప్రమాదం ఉంది.



నచ్చజెప్పినా వినిపించుకోలేదు

విషయం నా దృష్టికి వచ్చిన వెంటనే దేవర పొదిలాం జడ్‌పి హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాను. అదనంగా నలుగురు ఉపాధ్యాయులను నియమిస్తామని చెప్పాం. అయినా, ఫలితం లేకపోయింది. నేను వెళ్లి వచ్చాక కూడా 30 మందికిపైగా విద్యార్థులు వెళ్లిపోయారు-**ప్రేమ్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి, విజయనగరం**

యువకుడు దారుణ హత్య

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలి శివారులో ఓ యువకుడిని గొంతు కోసి హత్య చేశారు. ఈ ఘటన బుధవారం కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్ గ్రామం బుర్రిపాలెంకు చెందిన పేరిపోగు కోటేశ్వరరావు (34) హైదరాబాదులో ఉంటున్నారు. బ్యాంకు పనులపై కొద్ది రోజుల క్రితం గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో బుర్రిపాలెం రోడ్డు కూడలిలో చెట్ల పొదల్లో కోటేశ్వరరావు నిర్జీవంగా పడి ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో ఉన్న వ్యక్తిని బీరు బాటిల్‌తో గొంతు కోసి హతమార్చినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. పోలీసులు ప్రాథమిక విచారణ అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. వ్యక్తిగత పనుల మీద మంగళవారం ఉదయం తెనాలి వెళ్లిన కోటేశ్వరరావు తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. సినీ ప్రముఖుల వద్ద బౌన్సర్‌గా, కోటేశ్వరరావు గతంలో పనిచేశారు. కొంతకాలం తెనాలి ప్రాంతంలో పోలీస్ అధికారుల వాహనాలకు డ్రైవర్‌గా ఉన్నారు.